సాక్షి
కామారెడ్డి
సోమవారం । 7 । జూలై । 2025



బాల్యంపై భారం

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులతో బండెడు పుస్తకాలను మోయిస్తున్నారు. వాటిని మోయలేక పిల్లలు ఇబ్బందిపడుతున్నారు.

- 8లో ▸



శిథిలావస్థలో..

జీజీపేటలోని పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /22.8

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

నిఘా ఏదీ!?

- జిల్లాలో విచ్చలవిడిగా జిలెటిన్ స్టిక్స్ వినియోగం
- ఇష్టారాజ్యంగా బండరాళ్ల పేల్చివేతలు
- పట్టించుకోని అధికారులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న కాలంలో పేలుడు పదార్థాలపై గట్టి నిఘా ఉండేది. ఎక్కడైనా బండరాళ్ల పేల్చివేతలకు జిలెటిన్ స్టిక్స్ వాడుతున్నారని తెలిస్తే చాలు పోలీసులు దాడులు చేసి నిందితులను కటకటాల వెనక్కి పంపించేవారు. జిలెటిన్ స్టిక్స్ ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయన్న దానిపైనా కూపీ లాగేవారు. పేలుడు పదార్థాలు నక్సల్స్ చేతుల్లోకి ఏమైనా వెళ్లాయేమో చెక్ చేసేవారు. తర్వాతి కాలంలో పేలుడు పదార్థాలపై పోలీసుల నిఘా కరువైంది. విచ్చలవిడిగా జిలెటిన్ స్టిక్స్ వినియోగిస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

లెక్కే లేదు..

బండరాళ్లను పేల్చే కంప్రెషర్లకు సంబంధించి పోలీసులు నిఘా ఉంచాలి. కంప్రెషర్లకు ఎక్కడి నుంచి జిలెటిన్ స్టిక్స్ వస్తున్నాయన్న దానికి లెక్కలుండాలి. అనుమతులు తీసుకున్న తర్వాతే వాటిని వాడాలి. కానీ ఎక్కడా అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా వాడుతుండడం విస్మయం కలిగిస్తోంది. ఎక్కడెక్కడి నుంచో కంప్రెషర్లను తీసుకువచ్చి పేలుస్తున్నారు. కంకర క్వారీలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ బండరాళ్లను పేల్చడానికి జిలెటిన్ స్టిక్స్ వినియోగిస్తున్నారు. పట్టణాలు, గ్రామాలు, మండల కేంద్రాలలో వెలుస్తున్న వెంచర్లలో బండరాళ్లు ఉంటే వాటిని తొలగించేందుకు కంప్రెషర్లను వాడుతున్నారు. అలాగే రోడ్ల విస్తరణ పనుల్లో కూడా అడ్డుగా బండరాళ్లు వస్తే కంప్రెషర్లను వాడి పేలుస్తున్నారు. పంట చేలల్లో పెద్దపెద్ద బండరాళ్లు, గుట్టలు ఉంటే వాటిని తొలగించేందుకు పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. పోలీసు శాఖ నిఘా లేకపోవడంతో జిలెటిన్ స్టిక్స్ వినియోగంపై అడ్డూ అదుపులేకుండా పోయింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి పేలుడు పదార్థాల అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు సమాచారం ఇస్తేనే..

జిల్లా కేంద్ర నడిబొడ్డున ఎలాంటి అనుమతులు లేకుండా బండరాళ్లు పేల్చడానికి జిలెటిన్ స్టిక్స్ వాడుతున్నారని ఈనెల 4న స్థానికులు జిల్లా పోలీసు ఉన్నతాధికారికి సమాచారం ఇచ్చారు. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమై పేలుడు పదార్థాలు వాడిన ముగ్గురు వ్యక్తులతో పాటు స్థల యజమానిని అరెస్టు చేశారు. ఈ దాడిలో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు స్థలంలో లభించాయి. కాగా జిల్లా కేంద్రంలోనే బండరాళ్ల పేల్చివేతలకు దర్జాగా జిలెటిన్ స్టిక్స్ వాడుతున్నా పోలీసుల నిఘాకు చిక్కకపోవడం గమనార్హం.

అనుమతి తీసుకోకుండానే..

జిల్లాలో పేలుడు పదార్థాలను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా కంకర క్వారీలలో అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున బండరాళ్లను పేలుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో కంకర క్వారీలలో భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు వినియోగిస్తున్నారు. అనుమతులు తీసుకోకుండానే బండలు పేలుస్తున్నా పోలీసులు అటువైపు వెళ్లడం లేదన్న ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల పేలుళ్లతో సమీపంలోని గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. కొన్నిచోట్ల పేలుళ్లకు ఇళ్ల గోడలకు పగుళ్లు వస్తున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్ల నిర్మాణానికి సంబంధించి భారీ మొత్తంలో కంకర అవసరం అవుతుండడంతో కంకర క్వారీలకు గిరాకీ ఉంది. అటు జాతీయ రహదారుల నిర్మాణం, ఇటు ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణాలు, అలాగే ఇళ్ల నిర్మాణాలకు ఎక్కువ మొత్తంలో కంకర అవసరం అవుతోంది. దీంతో పెద్ద మొత్తంలో రాళ్లను పేలుస్తున్నారు.

అధికార పార్టీ నేతపై కేసు..



చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: అక్రమంగా పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను నిల్వ ఉంచిన కేసులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిని పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కేపీఆర్ కాలనీలో ఇంటి నిర్మాణం కోసం బండరాళ్ల పగుల గొట్టడానికి స్థలం యజమాని శ్రీధర్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులతో ఒప్పందం చేసుకున్నాడు. వారంతా కలిసి ఈనెల 4న జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, ఇతర సామగ్రితో బండరాళ్లు పేల్చడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే చుట్టుపక్కన వారు ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్పందించి, వారిని అరెస్ట్ చేశారు. బాంబ్‌స్క్వాడ్ సాయంతో పేలుడు పదార్థాలను పేల్చేశారు. లింగాపూర్ వద్దనున్న శ్రీవారి వెంచర్‌లో నిల్వ చేసిన 1,564 జిలెటిన్ స్టిక్స్, 41 డిటోనేటర్లు, 16 బెండల్స్ కార్డెక్స్ వైరు(4300 మీటర్లు), బ్యాటరీ, చెక్‌మీటర్ ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసిన గది పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భర్త, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, అతడి సోదరుడు గడ్డం సురేందర్‌రెడ్డిలది. ఈ కేసులో వారిద్దరితోపాటు మరో ఇద్దరిని నిందితులుగా చేర్చారు. శనివారం అర్ధరాత్రి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసి నిజామాబాద్ జైలుకు తరలించారు. అయన సోదరుడు సురేందర్‌రెడ్డి పరారీలో ఉన్నారు. అధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరెస్టు కావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

పేలుడు పదార్థాలతో సంబంధం లేదు

కామారెడ్డి టౌన్: శ్రీవారి వెంచర్‌లో నిల్వ చేసిన పేలుడు పదార్థాలతో తన భర్త చంద్రశేఖర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి వెంచర్‌లో తమకు గుంట భూమి కూడా లేదన్నారు. కేపీఆర్ కాలనీలో దొరికిన పేలుడు పదార్థాలకు, శ్రీవారి వెంచర్‌కు ముడి పెడుతున్నారని ఆరోపించారు. ఆ వెంచర్‌ను గతంలోనే వేరే వారికి అప్పజెప్పామన్నారు. నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి అరెస్టు చేసి జైలుకు తరలించడం సరికాదన్నారు. ఈ కేసులో తాము చట్ట ప్రకారం ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణమూర్తి, రవి, జూలూరి సుధాకర్, గడ్డమీది రాణి, సలీం తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం ఇందుప్రియ, కాంగ్రెస్ నాయకులు

మోస్తరు వర్షానికే మోకాళ్లోతు నీరు..



అయ్యప్ప ఆలయానికి వెళ్లే దారిలో నిలిచిన వర్షపు నీరు

- బాన్సువాడలో కుంటల్లా మారుతున్న రహదారులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు

SAKSHI సాక్షి ఫోకస్ FOCUS

బాన్సువాడ : చినుకు పడితే చాలు పట్టణ రోడ్లు కుంటల్లా మారుతున్నాయి. అంతర్గత డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారడంతో మోస్తరు వర్షానికే రోడ్లపైకి మోకాళ్లోతు నీళ్లు చేరుతున్నాయి. బాన్సువాడ పట్టణంలోని అయ్యప్ప ఆలయం రోడ్డు, అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాత బాన్సువాడకు వెళ్లే దారి, బేతాళ స్వామి ఆలయం వద్ద, సాయికృపానగర్ కాలనీ, వాసవీకాలనీ, సంగమేశ్వర కాలనీ మూడో రోడ్డులో చివరి వీధి, చైతన్య కాలనీల్లో మోకాళ్లోతు నీరు నిలుస్తోంది. రహదారులపై నీరు ఖాళీ అయిన తర్వాత బురద మేటలు తిష్టవేస్తున్నాయి. గతంలో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిండిపోవడంతో వాహనాల రాకపోకలతో అవి మరింత పెద్దవిగా మారుతున్నాయి. నీరున్నప్పుడు ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మురుగు నీరు రోడ్లపై పారుతుండడంతో పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రోడ్లపై నీరు నిలవకుండా డ్రెయినేజీలను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



సాయికృపనగర్ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

చేయూత పింఛన్ కట్!

- రెండు రోజులే పంపిణీ చేయడంతో పింఛన్ కోల్పోయిన వైనం
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- డబ్బులు రాలేవంటూ చేతులు దులుపుకుంటున్న అధికారులు



బాన్సువాడ పట్టణంలోని పోస్టాఫీస్

బాన్సువాడ : జిల్లాలో పలువురు వృద్ధులకు చేయూత పింఛన్లు నిలిచిపోయాయి. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. గత నెలలో డబ్బులు తక్కువ వచ్చాయంటూ రెండు రోజులపాటే పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో చాలా మంది పింఛన్లు కోల్పోయి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో ప్రతి నెలా 1,61,808 మంది వివిధ రకాల పింఛన్‌దారులకు రూ.3,61,60,828 పంపిణీ చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో 10 రోజులపాటు పంపిణీ చేసిన పింఛన్లు, మే నెలలో ఆరు రోజులు మాత్రమే అందజేశారు. పోస్టాఫీసుకు వచ్చే పింఛన్‌దారులు చాలా మంది వరుసలో నిలబడలేక వచ్చే నెలలో తీసుకుందామనుకునే వారు వందల్లో ఉన్నారు. ఒక్క బాన్సువాడ మున్సిపాలిటీలోనే 3,343 మందికి వివిధ రకాల పింఛన్లు ఉన్నాయి. అయితే పోస్టాఫీసులో విధులు నిర్వహించే ఒకే ఉద్యోగి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. జూన్ చివరి వారంలో విడుదలైన పింఛన్లు రెండు రోజులు మాత్రమే పంపిణీ చేయడంతో చాలా మందికి డబ్బులు అందలేదు. అదే సమయంలో చాలా మంది పింఛన్లు కట్ అయ్యాయని సిబ్బంది చెప్పడంతో వృద్ధులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

రూ. 25 నుంచి పింఛన్ తీసుకుంటున్న..



రూ.25 పింఛన్ ఉన్నప్పటి నుంచి తీసుకుంటున్నాను. మొన్న పింఛన్ కోసం వెళ్తే కట్ అయిందని చెప్పిండ్రు. నా కొడుకు ఆఫీసుల చుట్టూ తిరుగుతుండు. ఎవరూ పట్టించుకోవడం లేదు. మాలాంటి గరీబోళ్ల పింఛన్ కట్ చేస్తే ఎట్ల బతకాలె.

– మున్నబీ, పాత బాన్సువాడ

పింఛన్ కట్ అయిందంటున్నరు



నా భర్త చనిపోయినప్పటి నుంచి పింఛన్ వస్తుంది. పింఛన్ కోసం గత నెలలో వెళ్తే చాలా మంది ఉన్నారని ఇంటికి వచ్చినా. ఈ నెలలో వెళ్తే నీ పింఛన్ కట్ అయిందని చెబుతున్నారు.

– మున్నీబాయి, పాత బాన్సువాడ

డబ్బులు తక్కువగా వచ్చాయి

ఈ నెలలో పింఛన్ల డబ్బులు తక్కువగా రావడంతో చాలా మందికి డబ్బులు అందలేదు. ఎవరూ ఆందోళన చెందొద్దు. వచ్చే నెలలో అందరికీ పింఛన్లు ఇస్తాం. గతంలో మూడు నెలలు పింఛన్ తీసుకోకుంటే కట్ అవుతుండే. కానీ ఈసారి మినహాయించాం. అందరికీ పింఛన్లు అందుతాయి.

– సురేందర్, డీఆర్డీవో, కామారెడ్డి



బ్రాహ్మణపల్లి శివారులో నాట్ల కోసం మడిని సిద్ధం చేస్తున్న రైతు



గున్కుల్‌లో వరి నారు తీస్తున్న మహిళా కూలీలు

జోరందుకున్న వ్యవసాయ పనులు

ఇప్పటివరకు 1.67 లక్షల ఎకరాల్లో పంటల సాగు ■ వరి నాట్లలో బిజీగా అన్నదాతలు

నిజాంసాగర్: జిల్లాలో వ్యవసాయ సాగు పనులు జోరందుకున్నాయి. ఆరుతడి పంటల విత్తనాలు వేయడం దాదాపు పూర్తి కావడంతో వరినాట్లపై దృష్టి సారించారు. వానాకాలం సీజన్‌లో జిల్లాలో 5.14 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కాగా ఇప్పటి వరకు 1.67 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుతో పాటు బోర్లు, వ్యవసాయ బావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ కింద మహమ్మద్‌నగర్ మండలం మినహా బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలలో వరి నాట్లు చివరి దశకు చేరాయి. వర్షాలు లేకపోవడంతో మిగిలిన ప్రాంతాలలో నాట్లు మందకొడిగా సాగుతున్నాయి.

జిల్లాలో ఇప్పటివరకు సాగైన పంటల వివరాలు.. (ఎకరాల్లో)

పంట	సాగు విస్తీర్ణం	పత్తి	18,714	పెసర	332
సోయా	52,836	కంది	10,681	పల్లి	21
మొక్కజొన్న	36,906	మినుము	653	జొన్న	06
వరి	39,845	చెరుకు	492		

న్యూస్‌రీల్

నేడు బిచ్కుందకు మంత్రి కోమటిరెడ్డి రాక



బిచ్కుంద: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం బిచ్కుందలో పర్యటించనున్నారు. జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. బిచ్కుంద మండలంలోని ఖద్గాం నుంచి డోంగ్లీ వరకు రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించి గోపన్‌పల్లి చౌరస్తా వద్ద శిలాఫలకం ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటన రూట్‌ను ఆదివారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. ఆమె తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి పర్యటన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

మంత్రి వస్తున్నారని..



బిచ్కుంద: మండల కేంద్రంలో సోమవారం ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ శాఖ అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. మండల కేంద్రంతోపాటు బాన్సువాడ మార్గంలో రోడ్డు దెబ్బతింది. చాలాచోట్ల పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇన్నాళ్లూ పట్టించుకోని అధికారులు.. ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వస్తుండడంతో మరమ్మతులు చేయించారు. అయితే తారు పోయకుండా కంకర వేసి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. కేవలం కంకర పోసి వదిలేయడంతో ఆ దారిలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రయథ్లాన్ పోటీల్లో జిల్లాకు వెండి పతకం

కామారెడ్డి అర్బన్: హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ట్రయథ్లాన్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి సత్తాచాటింది. అండర్–10 విభాగంలో బి.ధనశ్రీ స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో ద్వితీయ స్థానం పొంది వెండి పతకం సాధించింది. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు.

'దళితుడి ఇంటిని కూల్చేయడం సరికాదు'



ఎల్లారెడ్డి: సామాన్య దళితుడి ఇంటిని కూల్చివేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. మల్కాపూర్‌లో ఇటీవల అక్రమ నిర్మాణమని పేర్కొంటూ బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు ఇంటిని కూల్చివేసిన విషయం తెలిసిందే. ఆదివారం బీజేపీ నేతలు ఆ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే నిర్మాణాన్ని కూల్చివేయించారని ఆరోపించారు. అలాంటివారికి రానున్న రోజులలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం నర్సింలుకు బీబీ పాటిల్ లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరుణతార, నేతలు బాణాల లక్ష్మారెడ్డి, నక్క గంగాధర్, బాలకిషన్, సతీష్, రాజేష్, దేవేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

10న పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

బాన్సువాడ : బాన్సువాడ నుంచి బీదర్ నర్సింహస్వామి ఆలయానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు డిపో మేనేజర్ సరితాదేవి తెలిపారు. ఈనెల 10న ఉదయం 6 గంటలకు బాన్సువాడ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని, జరా సంగంలోని మహాదేవుడి ఆలయంతోపాటు బీదర్ నర్సింహస్వామి ఆలయాల వద్ద ఆగుతుందని పేర్కొన్నారు. తిరిగి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి రాత్రి 12 గంటలకు బాన్సువాడకు చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ. 1,300, పిల్లలకు రూ. 650 అని, పూర్తి వివరాలకు 90634 08477 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

'హిందువులు సంఘటితంగా ఉండాలి'



కామారెడ్డి టౌన్: హిందువులు సంఘటితంగా ఉండాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంఘటక్ త్రివిక్రమ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్‌లో జరిగిన హిందూ ప్రముఖుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశాన్ని, దేవాలయాలను, తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. యువత దేశ భక్తిని అలవర్చుకోవాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తెలంగాణ ప్రాంత సంఘటక్ యాదిరెడ్డి, సహ సంయోజక్ మల్లికార్జున్, జిల్లా సంఘచాలక్ బొడ్డు శంకర్, సంయోజక్‌లు సాయికిరణ్, మదన్, నగర సంయోజక్ తరుణ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్లు మోస్తున్న బాల్యం



బాన్సువాడ రూరల్: జువైనల్ జస్టిస్ యాక్ట్–2015 ప్రకారం చిన్నపిల్లలకు పొగాకు, మద్యం విక్రయించడం శిక్షార్హమైన నేరం. కాని గ్రామాల్లో నేటికి నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు తమ పిల్లలను కల్లు దుకాణాలకు, బెల్ట్ షాపులకు పంపించి కల్లు, మద్యం, గుట్కా వంటి మత్తు పదార్థాలను తెప్పిస్తున్నారు. చిన్న పిల్లలకు మద్యం, పొగాకు, తంబాకు తదితర నిషేధిత ఉత్పత్తులు విక్రయించరాదనే విషయం తెలిసి కూడా దుకాణదారుడు లాభాపేక్షతో వాటిని విక్రయిస్తున్నారు. దీంతో వాటి ప్రభావం పిల్లల బాల్యంపై పడుతోంది. తమకు బుద్ధులు నేర్పించాల్సిన తల్లిదండ్రులే వీటిని స్వీకరిస్తున్నారంటే ఇందులో ఏదో ఉందని భావిస్తూ చిన్నారులు కూడా కొద్దికొద్దిగా వాటి రుచి చూస్తూ చివరకు బానిసలై పోతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో ముఖ్యంగా కల్లు ప్యాకెట్లు, మద్యం బాటిళ్లు, మత్తుపదార్థాలు చిన్నారులకు విక్రయించకుండా నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాల్యంపై 'బ్యాగు' భారం

- నర్సరీ నుంచే పుస్తకాల మోత
- బరువు మోయలేకపోతున్న చిన్నారులు
- ప్రయివేటు పాఠశాలల్లో అమలుకాని జీవో 22
- విద్యాశాఖ పర్యవేక్షణ కరువు

నందిపేట్(ఆర్మూర్): పసి వయసులోనే చిన్నారులు లేత భుజాలపై బండెడు పుస్తకాలు మోస్తూ కుంగిపోతున్నారు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు డజన్ల కొద్ది పుస్తకాలు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నాయి. దీంతో పిల్లలు పుస్తకాల బరువు మోయక తప్పడం లేదు. తరగతులు పెరిగే కొద్ది విద్యార్థుల బ్యాగు బరువు సైతం పెరుగుతుంది. సాధారణంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక పలక, ఒక నోట్ పుస్తకం ఉంటాయి. కానీ.. ప్రస్తుతం ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలోనే వారితో 20 పాఠ్య, నోట్ పుస్తకాలు మోయిస్తున్నారు. పిల్లల బరువులో పది శాతానికి మించిన బరువు వేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వం సైతం పుస్తకాల బరువుకు సంబంధించి నిబంధనలు తీసుకొచ్చినా వాటిని అమలు చేస్తున్న దాఖలాలు ఏ పాఠశాలలోనూ కనిపించడం లేదు.


బరువైన బ్యాగులతో పాఠశాలకు వెళుతున్న చిన్నారులు

2017లో జీవో జారీ

విద్యార్థుల వీపుపై బండెడు బరువును తగ్గించడానికి 2017లో ప్రభుత్వం 22 జీవోను జారీ చేసింది. ఎన్‌సీఈఆర్టీ ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన పుస్తకాలే ప్రయివేటు పాఠశాలలో వినియోగించాలి. హోం వర్కు పేరిట ట్యూషన్లు, స్పెషల్ క్లాసులు నిర్వహించొద్దు. ఆట పాటలతో చదువు సాగించాలి. విద్యార్థులకు వాటర్ బాటిల్ బరువు లేకుండా పాఠశాలలోనే తాగునీటిని అందించాలి. ఐదో తరగతి వరకు హోం వర్కు ఉండకూడదని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. అయినా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లాలోని ప్రయివేటు పాఠశాలలో జీవో అమలుకు నోచుకోవడం లేదు.

తరగతుల వారీగా బరువు ఇలా..

తరగతులు	బరువు (కిలోల్లో)
1–2	1.5
3–5	2–3
6–7	4
8,9	4.5
10	5

శారీరక ఎదుగుదలపై ప్రభావం

విద్యార్థులు అధిక భారం మోస్తున్నందున వారి శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,171 ఉండగా, ప్రయివేటు పాఠశాలలు 475 వరకు ఉన్నాయి. ఒకప్పుడు ఆరు సబ్జెక్టులకు ఆరు నోట్‌బుక్కులతోపాటు ఒక రఫ్ నోట్‌బుక్ మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు సబ్జెక్టుకు ఒక రఫ్ బుక్‌తోపాటు గైడ్లు, డ్రాయింగ్, రికార్డులు, డైరీలు, ఇతర బుక్‌లు కలుపుకొని కిలోల కొద్ది పుస్తకాలను బ్యాగులో మోసుకెళ్లాల్సి వస్తుంది. రోజుకు 10 కోలోల బరువు కంటే ఎక్కువగానే చిన్నారులు తమ భుజాలపై మోస్తూ ఒకటి, రెండు అంతస్తుల భవనాల్లోని తరగతి గదులకు వెళుతున్నారు. దీంతో చాలా మంది పిల్లలు వెన్ను నొప్పి, జాయింట్ పెయిన్స్ బారిన పడుతున్నారు.

చదువుపై శ్రద్ధ పెట్టలేరు..

అధిక బరువు మోస్తున్న కారణంగా పిల్లలు మానసిక ఆందోళన గురవుతారు. త్వరగా అలసిపోయి చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతారు. నడుము, వెన్ను, కండరాల నొప్పులు వచ్చే ఆస్కారం ఉంటుంది. వయసుకు తగిన బరువును మాత్రమే చిన్నారులతో మోయించాలి.

– ప్రవీణ్, వైద్యాధికారి, నందిపేట

ఊరి పేరులో భాగమైన రథాలు



రామారెడ్డిలోని సీతారామచంద్ర స్వామి, రాజరాజేశ్వర స్వామి రథాలు, కాలభైరవుడి రథం

మీకు తెలుసా?

మండల కేంద్రమైన రామారెడ్డిని పూర్వకాలం నుంచే రథాల రామారెడ్డిగా పిలిస్తున్నారు. దోమకొండ సంస్థనాధీశులు రామిరెడ్డి, గ్రామంలోని రామాలయం పేరుమీదుగా గ్రామానికి రామారెడ్డి అనే పేరు వచ్చింది.

- రామారెడ్డి గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఒక రథం, రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఒక రథం పూర్వకాలం నుంచే ఉన్నాయి. అలాగే ఇసన్నపల్లి(రామారెడ్డి) కాళభైరవుడి ఆలయంలో ఒక రథం ఉంది.
- ఊర్లో ఇన్ని రథాలు ఉండటంతో గ్రామం పేరు రథాల రామారెడ్డిగా ఎన్నో ఏళ్ల నుంచి వాడుకలో ఉంది.
- ప్రతి ఏడాది శ్రీరామనవమి రోజు సీతా రామచంద్రస్వామి, రాజరాజేశ్వర స్వామి వార్లకు రథోత్సవం నిర్వహిస్తారు.
- ప్రతి యేటా కార్తీక బహుళ పంచమి నుంచి కార్తీక బహుళ నవమి వరకు జరిగే కాలభైరవుడి జన్మదినోత్సవాల్లో స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు.
- సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వర స్వామి రథాలను 1992 వరకు కట్టెలతో తయారుచేసి, ఉత్సవాలు ముగిసిన తర్వాత విప్పి వేసేవారు.
- 1995లో గ్రామస్తులు ఇనుప రథాలను తయారు చేయించారు. – రామారెడ్డి

సమాచారం

నిందితుల అరెస్టు.. నిబంధనలు

ఖలీల్‌వాడి: వివిధ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసేటప్పుడు పోలీసులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్) చట్టం ప్రకారం నడుచుకోవాలి. క్రిమినల్ కేసుల్లో మహిళలు, వృద్ధుల అరెస్ట్, విచారణ చేసేటప్పుడు చట్టాలకు లోబడి వ్యవహరించాలి.

- మూడేళ్ల జైలు శిక్ష ఉన్న నేరాల కింద నమోదైన కేసుల్లో 60ఏళ్ల పైబడిన వారు నిందితులుగా ఉంటే వారిని అరెస్ట్ చేయడానికి ఏసీపీ, పైస్థాయి అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- నేరాల్లో మహిళలు నిందితులైతే, వారిని సూర్యోదయం తర్వాత లేదా సూర్యాస్తమయం లోపు అరెస్ట్ చేయాల్సి ఉంటుంది.
- రాత్రివేళల్లో అయితే నిందితురాలు ఉన్న ప్రాంతంలో జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ లేదా, కేసు నమోదు చేసిన ప్రాంతంలోని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి, వారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. నిందితురాలి వెంట మహిళ పోలీసులను ఉంచాలి.

మురికి నీటి గుంటలను తొలగించరూ..!



జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉన్న నీటి గుంట, మదర్సా వద్ద..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు పాఠశాలల వద్ద ఉన్న మురికి నీటి గుంటలను పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద, మదర్సా పాఠశాల పక్కన ఉన్న మురికి నీటి గుంటను పూడ్చి వేసి దోమల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. వాసన భరించలేకున్నామని వాపోతున్నారు.

ఆశల మొలకలు



బిచ్కుంద(జుక్కల్): ఖరీఫ్ సాగుకు మృగశిరకార్తె ప్రారంభంలో కురిసిన వర్షాలకు కొందరు విత్తనాలు విత్తారు. 20 రోజుల పాటు వర్షాల జాడ లేకపోవడంతో ఆందోళన చెందారు. విత్తనాలు విత్తడంలో వెనబడ్డ రైతులు తర్వాత కురిసిన వానలతో ఎన్నో ఆశతో విత్తనాలు విత్తారు. ప్రస్తుతం మొలకలు రావడంతో రైతులు ముఖాల్లో ఆనందం కనపడుతోంది. వారి ఆశలు చిగురిస్తున్నాయి. రైతులు ప్రతి ఏటా పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, అతివృష్టి, అనావృష్టితో ప్రతి ఏటా నష్టాల పాలవుతున్నారు. ఈ ఖరీఫ్‌లోనైనా పంటలు బాగాపండి అప్పుల నుంచి బయట పడతామని ఖరీఫ్ సాగుపై రైతులు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. విత్తిన సోయా, కంది, పత్తి, పెసర విత్తనాలు పూర్తి స్థాయిలో మొలకెత్తడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కొందరు రైతులకు సోయా మొలకలు 50 శాతం వరకు రాకపోవడంతో తిరిగి రెండు మూడు సార్లు విత్తారు. ఈ సారి మొలకలు 80 శాతం రావడంతో ఆశించినంత దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. సోయా, కంది, మినుము, పెసర పంటలకు సరిపడినంత వర్షం పడుతుండటంతో పంటలకు ఢోకాలేదని రైతులు అంటున్నారు. మండలంలో 9 వేలు ఎకరాలలో సోయా, 1,500 ఎకరాలలో కంది, 300 ఎకరాలలో పెసర, మినుము పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

చినుకు పడితే చిత్తడే


బురదమయంగా మారిన దోమకొండ–ముత్యంపేట రోడ్డు


ముత్యంపేట గ్రామంలో గుంతలమయంగా మారిన బీటీ రోడ్డు

దోమకొండ: మండలంలోని ముత్యంపేట–దోమకొండ దారి చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. చిన్నపాటి వర్షాలకే రోడ్డు బురదమయంగా మారుతుంది. దీంతో రోడ్డుపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బీటీ రోడ్డుగా మార్చాలని ఆ మార్గంలో ప్రయాణించే వారు కోరుతున్నారు. అలాగే చిన్నపాటి వర్షానికే ముత్యంపేటలోని బీటీ రోడ్డు బాగా దెబ్బతిన్నది.


గుంతలతో దర్శనమిస్తున్న తాడ్వాయి–దేవాయిపల్లి రోడ్డు

అధ్వానంగా తాడ్వాయి– దేవాయిపల్లి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల నుంచి దేవాయిపల్లి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు వెంట కిలోమీటరుకు 10 లోతు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళలో ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహదారులు భయపడుతున్నారు. కనీసం ప్యాచ్ వర్క్ అయినా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభమైన అర్ధచాతుర్మాస్య ఉత్సవాలు



కామారెడ్డి అర్బన్: స్థానిక సిరిసిల్లరోడ్డులోని గీతా మందిరం 43వ అర్ధ చాతుర్మాస్య మహావ్రత ఉత్సవాలు తొలిఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఉత్సవాల ప్రారంభ సూచికగా గీతా మందిరం అధ్యక్షుడు పాత అశోక్ కాషాయజెండాను ఎగురవేశారు. ఈ నెల 9వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ధరానంద భారతి స్వామీజీ ఓంకార గాయత్రి వేద జ్ఞానప్రవచనాలు చేస్తారని అధ్యక్షుడు అశోక్ తెలిపారు. గీతా మందిరం ప్రతినిధులు అర్వపల్లి రమేష్, పార్శి లక్ష్మీపతి, దోమకొండ కృష్ణమూర్తి, అర్చకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి బాడీ ఫ్రీజర్ వితరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు గ్రామ పంచాయతీకి బాడీ ఫ్రీజర్‌ను ఆదివారం వితరణ చేశారు. బాలుర పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు గత మే నెలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి తమ వంతుగా సహాయం చేయాలని రూ. 50 వేలు విలువ గల బాడీ ఫ్రీజర్‌ను వితరణ చేశారు. అలాగే పాఠశాలకు రూ.10 వేల విలువ గల సౌండ్ సిస్టంను అందజేశారు. పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, సాయిలు, కృష్ణమూర్తి, మహేష్, శ్రీధర్, స్వామి, నరేందర్, సత్యనారాయణగౌడ్, జీపీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

మైనారిటీ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి



బాన్సువాడ రూరల్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, నాణ్యమైన విద్యకోసం మైనారిటీ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎల్లారెడ్డిలోని మైనార్టీ పాఠశాల ఉపాధ్యాయులు బాలమణి, నవీన్ కుమార్, శేఖర్, శివప్రసాద్‌లు కోరారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలోని ఇస్లాంపుర, డబుల్‌బెడ్‌రూం కాలనీ, సంగమేశ్వరకాలనీల్లో పాఠశాలలో అడ్మిషన్ల కోసం ప్రచారం చేపట్టారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాం, కాస్మోటిక్‌చార్జీలు, పౌష్టికాహారంతో కూడిన భోజన వసతి సౌకర్యాలు ఉన్నాయన్నారు. ముస్లిం విద్యార్థులకు ఉర్దూ, అరబ్బీ, నమాజ్ సౌకర్యం ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ఎల్లారెడ్డిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

కాయిన్ మింగిన బాలుడు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన బందెల తన్వీర్ అనే రెండేళ్ల బాలుడు శనివారం సాయంత్రం ఆడుకుంటూ రెండు రూపాయల కాయిన్ మింగాడు. బాలుడికి ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో వెంటనే తల్లిదండ్రులు గమనించి లింగంపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఎక్స్‌రేలో రెండు రూపాయల కాయిన్ గొంతులో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కామారెడ్డిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆధునిక పరికరాల సహాయంతో గొంతులో ఇరుక్కున్న కాయిన్ బయటకు తీశారు. దాంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



మద్నూర్(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆర్ఐ సాయిబాబా ఆదివారం తెలిపారు. పోతంగాల్ మంజీరానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా లింబూర్ గ్రామం వద్ద శనివారం రాత్రి ట్రాక్టర్‌ను పట్టుకున్నామని అన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం..

రుద్రూర్: పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని శనివారం రాత్రి రుద్రూర్ మండల కేంద్రంలో పట్టుకున్నట్టు ఎస్సై సాయన్న తెలిపారు. రాజీవ్ నగర్ కాలనీ వద్ద బొలెరో వాహనాన్ని పట్టుకొని అందులో ఉన్న ఎనిమిది ఎద్దులను స్థానిక గోశాలకు తరలించామన్నారు. వాహన యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ మృతి

బోధన్: ఎడపల్లి మండలం జానకంపేట్ రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే పట్టాలపై ఓ గుర్తుతెలియని మహిళను గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందింది. ఆదివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ హరికృష్ణకు తెలుపగా, ఆయన నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే రైల్వే పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని రైలు రాకను గుర్తించకుండా గుర్తుతెలియని మహిళ పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు వారు పేర్కొన్నారు. మృతురాలిని గుర్తించేందుకు ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. మృతురాలి వయస్సు సుమారు యాభై ఏళ్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలిని గుర్తించిన వారు నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్సై సాయిరెడ్డి, 8712658591, 9493451642 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మాన్యాపూర్‌లో ఒకరి ఆత్మహత్య

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని మాన్యాపూర్ గ్రామ శివారులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మాన్యాపూర్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ (35) కుటుంబంలో గతకొన్ని రోజులు గొడవలు జరుగుతున్నాయి. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ బుచ్చయ్య రెండు నెలల క్రితం ఓ ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కానిస్టేబుల్ 2004బ్యాచ్ సభ్యులు .3లక్షలు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ బ్యాచ్‌కు చెందిన బుచ్చయ్య ఆకస్మిక మరణం తీరని లోటు అన్నారు. కానిస్టేబుల్‌లు నాయిని గంగారాం, నర్సింగ్, సురేష్, రాజశేఖర్, నరేష్, సాయిలు, శైలేష్, నేతా స్వప్న, ఇంద్ర, అనిల్ పాల్గొన్నారు.

మేకల మందపై చిరుత దాడి

నవీపేట: మండలంలోని మిట్టపూర్ శివారులో ఆదివారం సాయంత్రం మేకల మందపై చిరుత దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన మేకల కాపరి భీమన్న గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మేకలను మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వెళ్తుండగా మందపై చిరుతపులి దాడి చేసింది. ఒక మేకపై దాడి చేసి, మళ్లీ చెట్ల పొదల్లోకి వెళ్లింది. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేసినట్లు బాధితులు తెలిపారు.

మలేషియాలో వలస కార్మికుల సదస్సు

- 'గల్ఫ్ సంక్షేమ బోర్డు'పై చర్చ




వలస కార్మికుల అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల వలస కార్మిక సంఘాల ప్రతినిధులు

మోర్తాడ్(బాల్కొండ): అంతర్జాతీయ వలసలపై మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈనెల 4వ తేదీన ప్రారంభమైన మూడు రోజుల సదస్సు ఆదివారం ముగిసింది. బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఈ సదస్సును నిర్వహించింది. భారత్‌తో పాటు ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్, నేపాల్, ఖతార్, బహ్రెయిన్, క్రోయేసియా, మలేషియా తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో తెలంగాణ నుంచి ఖతర్‌కు వలస వెళ్లి అక్కడ తెలంగాణ గల్ఫ్ సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుందరగిరి శంకర్‌గౌడ్, గల్ఫ్ రిటర్నీ, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సైండ్ల రాజారెడ్డి పాల్గొన్నారు. ఈ సదస్సులో 'గల్ఫ్ సంక్షేమ బోర్డు'పై చర్చించినట్లు వారు 'సాక్షి'తో తెలిపారు. వలస కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతో పాటు గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు జరిగితేనే సౌకర్యాలు మెరుగవుతాయనే అభిప్రాయాన్ని సదస్సులో పాల్గొన్నవారు వ్యక్తం చేశారన్నారు. వలస కార్మికులకు వివిధ దేశాల చట్టాలపై అవగాహన కల్పించడం, ఆయా దేశాలలో పాటించాల్సిన నియమ నిబంధనల గురించి వివరించడం, తద్వారా వాణిజ్యాభివృద్ధికి పాటుపడాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామని తెలిపారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, వలస కార్మికుల పిల్లలకు గురుకుల విద్యా సంస్థలలో ప్రత్యేక ప్రవేశాలకు అనుమతి, ప్రవాసీ ప్రజావాణి నిర్వహణ అంశాలను సదస్సులో వివరించామన్నారు. దీనిపై సదస్సులో పాల్గొన్నవారు హర్షం వ్యక్తం చేశారన్నారు.

తాళం వేసిన మూడిళ్లలో చోరీ

- సుమారు 11 తులాల బంగారం, రూ.35వేల నగదు అపహరణ


వివరాలు సేకరిస్తున్న ఎస్సై సుష్మిత

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని నర్సింగ్‌పల్లిలో తాళం వేసిఉన్న మూడిళ్లల్లో గుర్తుతెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలోని గన్నారం మోహన్ తన ఇంటికి తాళం వేసి డాబాపైన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. అర్ధరాత్రి వేళ దుండగుడు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. బెడ్‌రూంలోని బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న 11 తులాల వరకు బంగారం, బంగారు నగలు, రూ.10వేల వరకు నగదును దోచుకెళ్లాడు. అనంతరం దుబ్బాక గంగామణి ఇంటి తాళాలు పగులగొట్టి రూ.25వేల నగదును ఎత్తుకెళ్లాడు. అదేవిధంగా అరుగు చిన్నయ్య ఇంటి తాళాలు ధ్వంసం చేసినప్పటికీ విలువైన వస్తువులు లేకపోవడంతో చోరీకి పాల్పడలేదు. ఆయా ఇళ్ల కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం లేచి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం బృందం ఘటనాస్థలానికి చేరుకుని వేలి ముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై సుస్మిత కేసు నమోదు చేసుకున్నారు. కాగా దుండగుడు ఒక్కడే వచ్చి మూడిళ్లలో చోరీ చేసినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. మంకీ క్యాంప్, చేతులకు గ్లౌజులు ధరించి ఉన్నాడని, త్వరలోనే దొంగను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

విచ్చలవిడిగా గడ్డిమందు వాడకం


లక్ష్మాపూర్ శివారులో గడ్డిమందు వాడకంతో ఎండిపోయిన ఒడ్డుపై ఉన్న గడ్డి

ఎల్లారెడ్డిరూరల్: ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందును వాడుతూ ప్రజలను అనారోగ్యాల బారిన పడేలా చేస్తున్నారు. పంటలు పండించే ప్రాంతాలలో ప్రభుత్వం గ్లెఫ్లోసెట్ మందును నిషేధించినప్పటికి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఫర్టిలైజర్ దుకాణాదారులు విచ్చలవిడిగా గడ్డిమందును విక్రయిస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. గ్లెఫోసెట్ గడ్డిమందు వాడకం వల్ల మానవుడి నాడీవ్యవస్థపై ప్రభావం చూపడంతో పాటు పర్యావరణానికి హాని కలిగిస్తున్నదన్న కారణంతో ప్రభుత్వం ఆ మందును నిషేధించింది. అధికారుల తనిఖీలు లేకపోవడంతోనే నిషేధిత గడ్డి మందు అమ్మకాలు జరుగుతున్నాయి.


శివానగర్‌లో వాడిపోయిన గడ్డి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

రుద్రూర్: సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సై సాయన్న సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.